https: / / trinetnews.com /

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

10PM to 1PM

సంపుటి: 01 / సంచిక:17 / పేజీలు :04 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / గురువారం , సెప్టెంబర్ 03,2026




**రక్షణ పరిశ్రమలకు ప్రోత్సాహం**

తెలంగాణలో రక్షణ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. డిఫెన్స్ పరిశ్రమలకు అవసరమైన భూమి, మౌలిక వసతులు, రవాణా సదుపాయాలు కల్పించడంతో పాటు పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడంపై దృష్టి సారిస్తోంది. రక్షణ పరికరాల తయారీ, పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి హైదరాబాద్‌ను కీలక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ వేదిక**

డిఫెన్స్ ఎక్స్‌పో--2026 హైదరాబాద్ నగరానికి మరో అంతర్జాతీయ గుర్తింపును తీసుకురానుంది. దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ రక్షణ సంస్థలు, తయారీదారులు, పరిశోధకులు, నిపుణులు, పెట్టుబడిదారులు ఈ వేదికపై తమ ఉత్పత్తులు, సాంకేతికతను ప్రదర్శించనున్నారు. రక్షణ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్లు, క్షిపణి వ్యవస్థలు, రక్షణ పరికరాల తయారీపై చర్చలు జరగనున్నాయి.

**పెట్టుబడులు.. పరిశ్రమలు.. ఉపాధి**

రక్షణ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో తెలంగాణలో కొత్త పరిశ్రమలకు మార్గం సుగమం కానుంది. దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తే తయారీ యూనిట్లు, పరిశోధనా కేంద్రాలు, స్టార్టప్‌లు ఏర్పడే అవకాశం ఉంది. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించి రక్షణ రంగంలో అవకాశాలు కల్పించేందుకు కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

**రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి**

హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న డిఫెన్స్ సంస్థలు, పరిశోధనా కేంద్రాలకు అనుకూల వాతావరణాన్ని మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రక్షణ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పరిశ్రమలు--పరిశోధనా సంస్థల మధ్య సమన్వయం పెంచడం ద్వారా తెలంగాణను డిఫెన్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు హైదరాబాద్ జాతీయ స్థాయిలో మరింత కీలక స్థానాన్ని సంపాదించే అవకాశం ఉంది.

## 4 న కృష్ణస్వామి జయంతి వేడుకలు .



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ ,సెప్టెంబర్,3,

ఈ నెల నాలుగవ తేదీన కొరివి కృష్ణస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దోమల్‌గూడ-రాంనగర్ డివిజన్ పరిధి బోయగుడలోని ముదిరాజ్ మహాసభ భవన్ లో కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ముదిరాజ్‌మహాసభ వ్యవస్థాపకులు,సంఘసంస్కర్త, మాజీ మేయర్ దివంగత కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 133 వ జయంతి వేడుకలను బోయగుడాలోని ముదిరాజ్ భవన్లో ఈ నెల 4 వ తేదీ శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి,మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,రాష్ట్ర బి సి సంక్షేమ,అభివృద్ధి సంస్థ సలహాదారు వి.హనుమంతరావు,ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు అధ్యక్షులు జి.దివాకర్ ముదిరాజ్,ఉపాధ్యక్షుడు మన్మోహన్ ముదిరాజ్,ప్రధానకార్యదర్శి కృష్ణమూర్తి ముదిరాజ్,గొడుగు ఆంజనేయులు,సురేందర్,వెంకట్రావు,మంద శ్రీనివాస్,నీలం శ్రీనివాస్,నరేష్ కుమార్,రాజేంద్ర ప్రసాద్,లక్ష్మణరావు, శ్రీనివాస్.

## మార్కెట్లలో మళ్లీ జోష్

### మూడు రోజుల పతనానికి బ్రేక్.. లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ






వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో నష్టాలను చవిచూసిన భారత స్టాక్ మార్కెట్లు గురువారం కోలుకున్నాయి.
ప్రధాన సూచీలు ప్రారంభ ట్రేడింగ్‌లో లాభాలను నమోదు చేశాయి.
సెన్సెక్స్, నిఫ్టీ రెండూ సుమారు 0.35 శాతం వరకు పెరిగాయి.
బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌కు ప్రధాన మద్దతుగా నిలిచాయి.
భారత బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీగా విదేశీ కరెన్సీ ప్రవాహం రావడం కూడా సానుకూల ప్రభావం చూపింది.
ఎన్‌ఆర్‌ఐ డిపాజిట్లు, ఇతర విదేశీ కరెన్సీ మార్గాల ద్వారా పెద్ద మొత్తంలో నిధులు సమకూరాయి.
దీంతో రూపాయి స్థిరత్వానికి కూడా మద్దతు లభించే



అవకాశం ఉంది.
మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీల్లోనూ కొనుగోళ్ల ధోరణి కనిపించింది.
అయితే అంతర్జాతీయ మార్కెట్ల పరిస్థితులు, ముడిచమురు ధరలు మార్కెట్‌కు సవాలుగా ఉన్నాయి.
పెట్టుబడిదారులు రాబోయే ఆర్థిక గణాంకాలు, వడ్డీ రేట్లపై నిర్ణయాలను గమనిస్తున్నారు

## జాతీయ లోక్ అదాలత్ లో కేసు ల పరిష్కారానికి చొరవ చూపాలి : జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళి మోహన్

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ ,సెప్టెంబర్,3,

ఈ నెల 12వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లాలో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె మురళి మోహన్ పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు కార్యదర్శి ఆధ్వర్యంలో న్యాయ వాదులతో కోర్టు ప్రాంగణంలో సన్నాహక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ కేసులకు సంబంధించి ఫిర్యాదుదారుల తరఫు న్యాయవాదులు, బీమా (ఇన్సూరెన్స్) సంస్థల న్యాయవాదులను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె మురళి మోహన్ మాట్లాడుతూ..
కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మోటారు వాహన ప్రమాద నష్టపరిహార కేసులను రాజీమార్గం ద్వారా త్వరితగతిన పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.
బాధితులకు తగిన న్యాయమైన నష్టపరిహారం సత్వరమే




అందేలా ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, వారి న్యాయవాదులు స్పందించి లోక్ అదాలత్ కు సహకరించాలన్నారు. జాతీయ లోక్ అదాలత్ నాటికి ఎక్కువ సంఖ్యలో క్లెయిమ్‌లు పరిష్కారమయ్యేలా ముందస్తుగానే ప్రీ లోక్ అదాలత్ లు ఈ నెల 7 మరియు 8 వ తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున రాజీకి సిద్ధమైన కేసుల వివరాలను న్యాయవాదులు ఐదవ తేదీ లోపు న్యాయ సేవా సంస్థలో అందించాలని కోరారు. ఈ ప్రీ లోక్ అదాలత్ ద్వారా పిటిషనర్లు, ఇన్సూరెన్స్ కంపెనీల మధ్య సంప్రదింపులు జరిపి సత్వర పరిష్కారం దిశగా కృషి చేయడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఇచ్చే తీర్పులపై అప్పీలు ఉండదని, కోర్టు ఫీజు కూడా రీఫండ్ అవుతుందని, ఇరువర్గాలకు ఇది ఎంతో ప్రయోజనకరమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం లో మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి స్వాతి మురారి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సత్యనారాయణ, మరియు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## బంగారం ధరలపై కొత్త అంచనాలు

### అంతర్జాతీయ పరిణామాల మధ్య పసిడి మార్కెట్‌లో ఒడిదుడుకులు




అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధరల్లో మరోసారి కదలిక కనిపించింది. అమెరికా డాలర్, ట్రెజరీ బాండ్ రాబడుల్లో మార్పులు పసిడి ధరలను ప్రభావితం చేస్తున్నాయి. అమెరికా ఉద్యోగాల గణాంకాల కోసం పెట్టుబడిదారులు ఎదురుచూస్తున్నారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయానికి ఈ గణాంకాలు కీలకం కానున్నాయి. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో బంగారాన్ని పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా చూస్తున్నారు.

## మత్స్యకారులతో ముచ్చటించిన సీఎం చంద్రబాబు

### పెన్షన్ పంపిణీతో ముగిసిన నర్సాపురం పర్యటన





నరసాపురం ట్రైనెట్ న్యూస్ ,సెప్టెంబర్,3,

పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం పర్యటించారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా మత్స్యకారుల కుటుంబాలకు పింఛను పంపిణీ చేశారు. వేటకు వెళ్లే ఫెర్రీ పాయింట్‌కు ముఖ్యమంత్రి మొదట చేరుకున్నారు. పడవల వద్ద కూర్చున్న పలుగురు మత్స్యకారులతో ముచ్చటించారు. తిరుమని స్వామి అనే మత్స్యకారునికి స్వయంగా సీఎం పింఛను సొమ్మును అందజేశారు. వారి కుటుంబాల యోగక్షేమాలు, సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే పథకాల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. వేట సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను కూడా సీఎం అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో మత్స్యకారులు గల్లంతవుతున్న ఘటనలపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల దాదాపు 20 రోజుల పాటు సముద్రంలో కనిపించకుండా పోయిన కోనసీమకు చెందిన మత్స్యకారులను సురక్షితంగా తిరిగి తీసుకురావడంలో కోస్ట్‌గార్డ్, నేవీ, కేంద్ర మెరైన్ విభాగాల సహకారం తీసుకున్న విషయాన్ని సీఎం చంద్రబాబు వారికి వివరించారు. మత్స్యకారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరును సీఎం చంద్రబాబు వారిని అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల సేవలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న రూ.20 వేల ఆర్థిక సాయం వేట నిషేధ సమయంలో తమను ఆదుకుంటోందని మత్స్యకారులు సీఎంకు తెలిపారు. ఈ సమయంలోనే తమతో పాటు పడవలోకి రావాలని ఓ మత్స్యకారుడు సీఎంను ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు మత్స్యకారులతో కలిసి బోటులో ప్రయాణించారు. సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు రోజువారీ జీవితం ఎలా ఉంటుంది? ఎన్ని గంటలు సముద్రంలో ఉండాలి? ఆ సమయంలో భోజనం ఎలా చేస్తారు? వంటి విషయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు.

## అసెంబ్లీకి రాని కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి.



**కరకగూడెంలో కాంగ్రెస్ బైక్ ర్యాలీ.. మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్.**

ట్రైనెట్ న్యూస్ ,సెప్టెంబర్,3,

అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ప్రజా సమస్యలను ప్రస్తావించని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కరకగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు.సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ--డీసీసీ అధ్యక్షుల పిలుపు మేరకు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాలతో కరకగూడెం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ కార్యాలయం నుంచి పెట్రోల్ బంక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్--రాజీవ్ సెంటర్‌లో కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న కేసీఆర్ అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై గళం వినిపించాల్సిన బాధ్యత ఉందన్నారు. జీతం, భద్రత, వాహనాలు తదితర సౌకర్యాలకు ప్రజాధనం ఖర్చవుతున్నప్పటికీ ప్రజల సమస్యల కోసం అసెంబ్లీకి రాకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఇచ్చిన అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించిన ఆయన.. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గుర్తుంచుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను స్వీకరిస్తూ ప్రజాపాలన కొనసాగిస్తోందని తెలిపారు. కేసీఆర్‌కు ప్రజలపై నిజమైన బాధ్యత ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఇక్బాల్ హుస్సేన్ మరోసారి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు రక్షణ రంగంలో భారీ ప్రాజెక్టు

### డీఆర్‌డీఎల్ కోసం 416 ఎకరాలు.. డిఫెన్స్ హబ్‌గా నగరం



హైదరాబాద్‌ను రక్షణ పరిశోధన, తయారీ రంగంలో మరింత కీలక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.
డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీకి 416 ఎకరాల భూమిని అందించే ప్రతిపాదన ముందుకు వచ్చింది.
రక్షణ రంగానికి సంబంధించిన పరిశోధన, సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాలకు ఈ భూమిని వినియోగించే అవకాశం ఉంది.
హైదరాబాద్‌లో ఇప్పటికే అనేక రక్షణ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు పనిచేస్తున్నాయి.
వాటికి అదనంగా కొత్త ప్రాజెక్టులు రావడంతో నగర ప్రాధాన్యం మరింత పెరగనుంది.
డిఫెన్స్ ఎక్స్‌పో--2026ను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కూడా చర్యలు కొనసాగుతున్నాయి.
దేశీయ, అంతర్జాతీయ రక్షణ సంస్థలకు తమ సాంకేతికతను ప్రదర్శించే అవకాశం లభించనుంది.
రక్షణ పరికరాల తయారీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.
కొత్త పరిశ్రమలు ఏర్పడితే స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కూడా పెరగనున్నాయి.
డ్రోన్లు, క్షిపణి వ్యవస్థలు, ఏరోస్పేస్ పరికరాలు వంటి ఆధునిక రంగాల్లో అవకాశాలు విస్తరించవచ్చు.

## తెలంగాణలో కౌలు రైతులపై కొత్త చర్చ

### గుర్తింపు కార్డుల కోసం పార్టీల డిమాండ్



ట్రైనెట్ న్యూస్ ,సెప్టెంబర్,3,

తెలంగాణలో కౌలు రైతుల సమస్య మరోసారి రాజకీయ చర్చకు వచ్చింది.
కౌలు రైతులను అధికారికంగా గుర్తించాలని ఎనిమిది రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. 2011 లైసెన్స్‌డ్ కల్టివేటర్స్ చట్టం ప్రకారం కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశాయి.
వ్యవసాయ భూమిని సాగు చేస్తున్నప్పటికీ చాలామంది కౌలు రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందడం లేదనే వాదన ఉంది.
రుణాలు, పెట్టుబడి సహాయం, పంట నష్టపరిహారం వంటి అంశాల్లో గుర్తింపు కీలకంగా మారుతోంది.
కౌలు రైతుల వివరాలను గ్రామాల వారీగా నమోదు చేయాలని పార్టీలు సూచించాయి.
అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేలోపు ఈ ప్రక్రియపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరాయి.
రాష్ట్ర వ్యవసాయ రంగంలో కౌలు రైతుల పాత్ర గణనీయంగా ఉందని నాయకులు పేర్కొన్నారు.
భూమి యజమానులకే కాకుండా వాస్తవంగా పంట పండిస్తున్న రైతులకు కూడా ప్రభుత్వ సహాయం అందాలని డిమాండ్ చేశారు.
ఈ అంశం రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

## రూపాయికి భారీ మద్దతు

### విదేశీ నిధుల ప్రవాహం.. డాలర్‌పై కరెన్సీకి బలం





ట్రైనెట్ న్యూస్ ,సెప్టెంబర్,3,

అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువకు తాజాగా మద్దతు లభించింది.
భారత బ్యాంకింగ్ వ్యవస్థలోకి అంచనాలకు మించి విదేశీ కరెన్సీ నిధులు చేరాయి.
ప్రత్యేక విదేశీ కరెన్సీ సమీకరణ పథకాల ద్వారా భారీగా నిధులు వచ్చాయి.
వాటిలో ఎన్‌ఆర్‌ఐ డిపాజిట్ల వాటా గణనీయంగా ఉంది.
ఈ నిధులు దేశ విదేశీ మారక నిల్వలను బలోపేతం చేయడంలో సహాయపడనున్నాయి.
రూపాయి విలువపై ఒత్తిడిని తగ్గించేందుకు రిజర్వ్ బ్యాంక్‌కు మరింత వెసులుబాటు లభించవచ్చు. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడటం కూడా రూపాయికి అనుకూలంగా మారింది. అయితే ముడిచమురు ధరలు పెరిగితే దిగుమతుల వ్యయం పెరిగే అవకాశం ఉంది. అమెరికా ఆర్థిక గణాంకాలు, ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు రూపాయి కదలికలకు కీలకంగా మారనున్నాయి.
మార్కెట్ నిపుణులు రానున్న రోజుల్లో రూపాయి కదలికలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.